ఆదివారం కథ

మూడో మనిషి

జంధ్యం వెంకటేష్ బాబు

కార్తికేయ నిట్టూర్చాడు ''ఆయన అంత సులభంగా మారుతారనుకోను''.

''చివరి ప్రయత్నంగా నీ దగ్గరకు వచ్చాను''

అతడు కుర్చీలోనుండి పైకి లేచి కిటికీ దగ్గరగా వెళ్లాడు. కర్టెన్ గాలికి కదులుతోంది. ఆమె ఉన్నచోట పూర్తివెలుగు లేకపోవటంతో కర్టెన్ కదలికకు వెలుగునీడలు ఆమె ముఖంలో కదలాడుతూ జీవిత సత్యావిష్కరణ చేస్తున్నాయి.

కార్తికేయకు అన్నమీద కోపమూ వచ్చింది. తను ఎన్నోసార్లు చెప్పాడు. 'సాహిత్యం ద్వారా ఇతరులకు ఆనందం కలిగించడమే కాదు. మనమూ ఆనందంగా ఉండేలా మలచుకోవాలి, చేతిలో ఉన్న 'కళ'ను సద్వినియోగం చేసుకోవాలి... వచ్చినపాపులారిటీని వీలయినంతవరకూ కేష్ చేసుకోవాలి....

ఐదు నిముషాలక్రితం వదిన అన్నమాటలు గుర్తొచ్చాయి అతడికి ''ఆయన నీలాగే వ్రాయగలడు. నీకన్నా ఎక్కువ కష్టపడుతాడూ... కానీ ఫలితం ఏది?...''

అతడికి నవ్వొచ్చింది. 'ఎవరయినా తనకున్న 'కళ'ను అమ్ముకోవడమూ ఒక 'కళే'! 'అన్న' కు ఆ రెండోకళ తెలియదు. తను మంచి పండితుడు. తేనెలా తియ్యగా, వెన్నెలంత చల్లగా, సరళంగా... కథలు, నవలలూ వ్రాస్తారు. కానీ... 'అన్న'కు పరిచయాలెక్కువ. మోహమాటా ఎక్కువే! నా ఉద్దేశ్యం తనకు 'ఉపయోగపడని పాపులారిటీ మీద మోజుకూడా అనుకుంటా! అలా అతిగా వ్రాయటం వల్లనూ తన 'విలువ' దిగజార్చుకున్నాడని అంటున్నాను...''

కార్తికేయ అరనిముషం తటపటాయించక చెప్పాడు. ''వదినా! అన్నయ్యకు నా మీద కోపం. నేను నా పాపులారిటీ కేష్ చేసుకుంటున్ననీ, డబ్బు మోజుతో సాహితీ విలువలను దిగజార్చుతున్నాననీ, ఆయన నాతో పలకడం మానేశాడు. మొదటినుండీ ఆయనతో నాకంత చనువూ లేదు.... ఆయనిప్పుడు నేను 'మంచి' చెప్పినా వినడు... పైగా నన్నూ... నా విధానాన్ని తిట్టిపోస్తాడు... ఆయన్ని కదలించటం నన్ను నేను మానసికంగా బాధపెట్టుకోటమే. అవుతుంది.''

ఆవిడ కొద్దిక్షణాలు మాట్లాడలేదు. ''నిజమే... నాకు తెలుసు మీ ఇద్దరి మధ్యాసంబధాలు సరిగా లేవని! కాని...'' ఆమె బలంగా ఊపిరి వదిలింది. మా ఆర్థిక పరిస్థితి బాగా చితికిపోయింది కార్తీ.... ఆయన కథలను నమ్ముకుని, అన్ని పనులూ మానేసి, చాలీ చాలని సంపాదనంతో మమ్మల్ని బాధపెడుతున్నాడు''

''ఏమీ చేయలేం!'' అతడు అన్నాడు ''ఆయన అంత సులభంగా మారుతాడనుకోను... కాని... ఈనెలాఖరులో శ్రీనివాస్ ఢిల్లీనుండి వస్తున్నాడుగా! వాడికి చెప్పు వదినా... అన్నయ్యకు చిన్నతమ్ముడంటే ఇష్టం... వాడి మాటలు తను వినే అవకాశం వుంది.

ఆమె తలాడించంది. ''ఎవరు చెప్పినా ఆయన తన పంథా మార్చుకునిచేసే పనిలో పది రూపాయలు సంపాదిస్తే... మా ఆర్థిక పరిస్థితి చక్కబడుతుంది... వస్తాను కార్తి...''

అతను వ్రాసుకునే గదిలోనుండి ఇవతలకు వచ్చిందామె. 'ఆ గదిలో... నలుగురు కుర్రాళ్లు ఏకాగ్రతగా తెల్లకాగితాలు నలుపుచేస్తున్నారు...' ఆ సన్నివేశం ఆమెగుండెలో సూది పొడిచినట్టుగా అనిపించింది. 'ఆ అన్నకు పూర్తి వ్యతిరేకం ఈ తమ్ముడు...' ఆమె బాధగా నవ్వుకుంది.

★★★

బేగంపేట ఎయిర్‌పోర్టు నుండి రోడ్డెక్కాక కారు కుడివైపు తిరగబోతుంటే 'లేఫ్ట్ పోనివ్వు' చెప్పాడు శ్రీనివాస్.

పదమూడు నిముషాలు తర్వాత కారు ఆ [illegible]

ఆమె చిన్న మరిదిని చూసి ''రా బాబూ... రారా...'' అంది.

అతడు డ్రైవర్‌తో ''చిన్నన్నయ్యకు సాయంత్రం వస్తానని చెప్పు'' అన్నాడు.

కారెళ్లిపోయింది.

''ఉత్తరం చేరిందా?''

''ఆ! చేరింది... అన్నాయ్య ఎక్కడ?''

''ఆ రూములో వ్రాసుకుంటున్నాడు.... కూటికి, గుడ్డకు రాని రాతలెందుకో నాకయితే అర్థం కాదు''

శ్రీనివాస్ ఆ రూమ్‌లోకెళ్లాడు. ''హలో అన్నయ్యా''

టేబుల్‌ముందు కూర్చుని ఏకాగ్రతగా వ్రాసుకుంటున్న భరద్వాజ ''అరే శ్రీనూ... ఎప్పుడొచ్చావ్?''



''ఇప్పుడే... ఎయిర్‌పోర్టు నుండి తిన్నగా ఇక్కడికే''

''వాడు కారు పంపాడుగా అటెళ్లి ఉంటావనుకున్నాను''.

అతడు బదులివ్వలేదు.

విశ్రాంతి తీసు కోవడం అయ్యాక శ్రీనివాస్ సాయంత్రంగా, పెద్దన్నయ్య పర్సనల్ రూమ్‌లోకి వెళ్లాడు.

''ఏమిట్రా ఢిల్లీ విశేషాలేమిటి!''

''ఏమున్నాయ్... మామూలే...'' తేల్చేసి ''మీ ఆర్థిక పరిస్థితి ఎలా ఉందన్నయ్యా''

''ఏదోరా... అలా... అలా జరిగిపోతుంది''

'నేను వినడం మీరు మీ శ్రమను చాలా వరకూ వృధా చేస్తున్నారని... సాహితీ సేవను ఉచితంగా పంచుతున్నారని....''

''వదిన చెప్పిందా?''

శ్రీనివాస్ ఆరు సెకనులు ఆగాక చెప్పాడు ''చిన్నన్నయ్య అంటూంటే విన్నానోసారి''.

భరద్వాజకు కోపం ఎక్కువే రావడంతో కళ్లు ఎర్రబడ్డాయి. ''ఓహో! వాడి మాటలా [illegible] దోచుకోవమని చెప్పలేదా?''

శ్రీనివాస్ బలంగా ఊపిరి వదిలాడు ''చిన్నన్నయ్య మాటలు విని అనడం కాదుగానీ, మీరూ మీ ఆర్థిక పరిస్థితి మెరుగు పరచుకోవడం మంచిది... ఇది ఆనాటి కాలం కాదు. కాటుక కంటినీ. చుకట్టుపైబడి ఎలా ఏడ్చేవో... అంటూ 'రాత'ను అమ్ముకోకుండా ప్రజలకు అందించేందుకు... ఆనాడు - సాహిత్యం, మధ్యవర్తులు లేకుండా ప్రజలకే చేరేటి. నేటి సాహితీకారులకు, ప్రజలకు మధ్య వారధిగా పత్రికలున్నాయి. మీరు 'ఉచితసేవ'చేస్తే సరస్వతీదేవి సంతోషించదుగానీ, పత్రికలోళ్లు మాత్రం బాగుపడతారు...

అన్నయ్యకు అంతకన్నా ఎక్కువ చెప్పడం అనవసరం. తెలివైనవాడు 'చిన్నమాట' చెప్పినా దాని వెనుక ఉన్న ఆవేదన, అసలునిజం అర్థం చేసుకోగలడు.

ఆ సాయంత్రమే శ్రీనివాస్ చిన్నన్నయ్య ఇంటికి వెళ్లిపోయాడు.

★★★

''రోజు ఇలాగే పొద్దుపోతుందా?''

''ఒక్కొక్క రోజు ఆరింటిలోపే ఇంటికొచ్చేస్తాడు. ఎప్పుడయినా ఇలా...''

కార్తికేయ, భరద్వాజలా ఇంట్లో కూర్చుని వ్రాయడు. తను వ్రాసుకునేందుకు సపరేట్‌గా ఒక అపార్ట్‌మెంట్ కొనుగోలు చేశాడు. ఉదయం కారులో ఆ పార్ట్‌మెంట్‌కెళ్లి సాయంత్రంగా తిరిగొస్తుంటాడు...''

''ఇక్కడే ఎంతసేపని కూర్చుంటావ్? అలా లోపలకెళ్లి కూర్చుందాం'' చిన్నవదిన వెంట వారి బెడ్‌రూమ్‌లోకి నడిచాడు.

వదిన లిద్దరికీ ఆ మరిదీ అంటే చాలా ఇష్టం. గోరుముద్దలు తిని పించకపోయినా- అతడు బిడ్డలాంటివాడే!

''మీ పెద్ద వదిన ఢిల్లీకి ఉత్తరం వ్రాసినట్టుఆ అన్నయ్యకు చెప్పావా?''

''అలా చెపితే ఆమె మీద కోప్పడుతాడుగా. అందుకే... ఏదోనాకు. తోచింది చెప్పినట్లుగా ఆయన ప్రవర్తన మార్చుకోమని చెప్పాను''

ఆమె అర్థోక్తిగా నవ్వింది ''మీ పెద్దన్నయ్యను ప్రవర్తన మార్చుకోమని చెప్పావు... బాగుంది.... మరి మీ చిన్నన్నయ్యనూ తన పద్ధతి మార్చుకోమని చెప్పొచ్చుగా...''

''చిన్నన్నయ్యనా?'' అతడి ముఖంలో ఆశ్చర్యం ''చిన్నన్నయ్యను తనపద్ధతి మార్చుకోమనే అవసరం ఏముంది?... పెద్దన్నయ్య బమ్మెరపోతన... తన సృష్టిని అమ్ముకునే తెలివితేటలు లేనివాడు... చిన్నన్నయ్య శ్రీనాథుడు! తన కృతికి అత్యధిక రేటుకు అమ్ముకోగల లౌక్యుడు...''

ఒక చేతినీడ ఆమె ముఖం అలా కదలాడి ఇలా వెళ్లిపోయింది. అది గుర్తించలేని అమాయకుడు కాడు శ్రీనివాస్.

''నిజమే! మీ చిన్నన్నయ్య శ్రీనాథుకవి సార్వభౌముడుమే! సరసరస పోషణా చక్రవర్తి! కాదనను... కాని... శ్రీనాథుడు తన రచనలు అమ్ముకున్నాడు. ఇతరుల సృష్టికి తను తండ్రినని చెప్పుకోలేదు....''

అతడు మాట్లాడలేదు. అవతలివ్యక్తి తన మనసులోని అసంతృప్తి బయటకు ప్రదర్శించేవేళ ప్రేక్షకుడిలా ఉంటేనే ఆవ్యక్తి అంతా చెప్పగలడని- తనుచదివిన మానసిక విశ్లేషణా పుస్తకాలలో నేర్చుకున్నాడు. అందుకే ఆ మౌనం...!

''నీకు తెలుసా శ్రీనూ!.... నలుగురు కుర్రాళ్లు... తెలిసో, తెలియకో సాహిత్యమంటే ఉన్నత మయినదన్న భ్రమలో ఈ బురదగుంటలో చిక్కుకు పోయినవారు... కాలేకడుపుకి కాసిన్ని గంజినీళ్లకోసం అమ్ముడుబోయి మెదడును మరిగించి అక్షరాలు జాలువారిస్తూ... అవి తన పేరుతో అచ్చు వేసుకోవటం... నాకనిపిస్తుంది... ఒక ముసలివాడు తన రెండోపెళ్లానికి సంతానం కావాలని- తను సృష్టించే శక్తి కోల్పోయి- నవ యువకుల్ని ఆశ్రయించి- ఆ జన్మించిన వారికి తండ్రినని చెప్పుకోవడం... అది తెలిసినవారు ఆ ముసలివాడ్ని చూసి నవ్వుకోరా? అసలెంత నీచం?! ఘోస్ట్‌లని ఉపయోగించే ఈ రచయితలకు, అప్రయోజకుడైన ఆ ముసలివాడికి తేడా ఏముంది...?''

''చాలా ఎక్కువ మాట్లాడావు రమ్యా!''

వారిద్దరూ ఉలిక్కిపడి అటు చూశారు. వాకిట్లో-

కార్తికేయ!

ఎన్నాళ్ల ఆవేశమో ఆమెలో- ''లేదు... తక్కువే మాట్లాడాను''

కార్తికేయ మనసులోనే ఏదో గుణించుకో సాగాడు. కోపం తగ్గించుకునేందుకు ఆయన పాటించే పద్ధతి అది.

రెండు పదుల సెకనులు తర్వాత కార్తికేయ- ''ఇది వ్యాపారం'' అన్నాడు.

''నలుగురు కుర్రాళ్ల భవిష్యత్తు పాడుచేసే వ్యాపారం మనకొద్దు''

''డబ్బు సంపాదించాలంటే...''

కార్తికేయ మాటలు మధ్యలోనే కట్ చేశాడు శ్రీనివాస్'' డబ్బు సంపాదించడానికి ఇంతటి కీచానికి దిగజారనవసరంలేదు. సాహిత్యంలో సక్రమ మార్గంలో మీరు సంపాదించిన దానికన్నా ఎక్కువ సంపాదించోచ్చు...''

''పగతి కలలు కనుక తెలుగుసాహిత్యాన్ని కమర్షియలైజ్ చేసి అత్యధికంగా సంపాదించినవాడిని నేనే... ఇంతకన్నా ఎక్కువ ఎవరయినా సంపాదించగలరని నేననుకోవడంలేదు''

ఎందుకో... కర్టెన్ కదలటం మానేసింది.

''నేను సంపాదిస్తాను''

కార్తికేయ తమ్ముడి వంక చూశాడు... నవ్వాడు... చిన్న కుర్రేడు తప్పటడుగులు వేస్తూ కిందపడితే పెద్దవాడు నవ్వినట్టు... నవ్వాపి ''అసాధ్యం'' అన్నాడు.

''కాదు.... మీరు గిరిగీసుకున్న ఈ పరిధిదాటి ఇక్కడున్న ఆ నలుగుర్నీ నాశనంచేసి ఏకఛ్ఛత్రాదిపత్యంగా ఏలాలన్న ఆలోచన మాకేసి... విశాల ప్రపంచం వైపు ఒకసారి దృష్టి సారిస్తే అసాధ్యమేమీ కాదు... అది నేను సాధించాలనుకుంటున్నాను....''

మర్నాడు-

శ్రీనివాస్ ఢిల్లీ వెళ్లిపోయాడు.

★★★

మూడేళ్ల తర్వాత-

ఫోన్ రింగవుతుంటే లిఫ్ట్ చేశాడు కార్తికేయ. అవతలి స్వరంవిని అదిరిపడ్డాడు.... చాలా కాలం తర్వాత వింటున్నాడా స్వరం.

కొద్ది క్షణాల క్షేమసమాచారాల సంభాషణ తర్వాత అవతలి స్వరం అడిగింది.

''శ్రీనుకి ఫోన్‌చేసి అభినందనలు తెలిపావా?''

''ఎందుకు?''

''తెలుగులో సీరియలైజ్ అయిన వాడి నవల ఇంగ్లీషు అనువాదం సేథ్ నవల తర్వాత అత్యధికంగా అమ్ముడుపోయిందటగా...''

''అవును. లక్ష పౌండ్స్ రాయల్టీ వచ్చిందట...''

''ఆ నవల అంత అద్భుతంగా కూడా లేదు... నువ్వు వ్రాసిన కొన్ని నవలలతో పోల్చుకుంటే స్థాయి లేదు''

''నిజమే! క్షణం తర్వాత అన్నాడు కార్తికేయ. ''మనం పొరపాటు చేశాం. ఈ చిన్న మార్కెట్‌లో మన ఆధిపత్యం కోసం పోట్లాడుకుంటూ విశాల ప్రపంచం ఇంకా ఉందన్న మాట మరిచాం. అది గుర్తెరిగిన తమ్ముడు సక్రమంగానే నన్నుమించి సంపాదించాడు.''

''అయితే వాడికి అభినందనలు తెలియజేశావా?''

''లేదు... తెలియజేయబోవట్లేదు... మరి మీరు...?''

భరధ్వాజ నసిగి ''నాకూ... ఇష్టంలేదు'' అని ఫోన్ పెట్టేశాడు.